## క్లుప్తంగా

### తహసీల్దార్ కార్యాలయంలో తుపాను కంట్రోల్ రూమ్

సబ్బవరం: తుపాను ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు ఈ నెల 22 నుంచి 24 వరకు తుపాను ఉన్నట్లు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారని పేర్కొన్నారు. దీంతో సబ్బవరం మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, మిద్దెలు, తాటాకుల ఇళ్లలో నివసించేవారితో పాటు నీరు నిలిచి ఉండే ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల నిర్వహణ, ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేందుకు తమ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 94923 53994కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

### ఉమా చంద్రమౌళీశ్వరుడికి విశేష అభిషేకాలు


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని చంద్రగార్డెన్స్‌లో ఉన్న ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామికి రుద్రాభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు ఉదయర్‌కృష్ణశర్మ, ద్వాదశి సోదరులు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

### మాలికాపురమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట


విగ్రహాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో మాలికాపురమ్మ తల్లి విగ్రహాన్ని సోమవారం శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. శతాధిక విగ్రహ ప్రతిష్టకర్త దివాకర్ల భగవాన్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విగ్రహానికి భక్తులు అభిషేకాలు జరిపారు. అనంతరం ప్రతిష్టాపన ఘనంగా చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి దేశపాత్రునిపాలెం 11 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దేశపాత్రునిపాలెం, ఎస్సీ కాలనీ, శేషాద్రి నగర్, గ్లోబల్ స్కూల్, శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

### నర్సుల అసోసియేషన్ ఎన్నికలు రేపు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు బుధవారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లోని యూనియన్ బ్యాంకు సమీపంలోని నర్సుల క్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఓటరూ తప్పకుండా గుర్తింపు కార్డుతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డు లేక ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు.



# మలుపులు.. ప్రమాదాలకు నెలవులు

ఘాట్ రోడ్ల మీదుగా ప్రయాణించేటపుడు మనకు తరచూ కనిపించేది, వినిపించే మాట హెయిన్ పిన్ బెండ్/టర్న్/కార్నర్. ఈ రోడ్లపై ప్రయాణించేటపుడు అతి సమీపంలోకి వచ్చేంత వరకు అవతలి వాహనాలు మనకు కనిపించవు. దీంతో వేగంగా వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల బారినపడ్డ సంఘటనలు కోకొల్లలు. మైదాన ప్రాంతంలో కూడా ఇలాంటి రోడ్లను చూడాలంటే పరవాడ మండలంలో పర్యటిస్తే చాలు. చాలా గ్రామీణ రోడ్లు వీటికి ఏ మాత్రం తీసిపోనంత వంపులతో మలుపులు తిరిగి ఉన్నాయి. ఆ మలుపుల వద్ద తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి, ఎదురుగా వచ్చే వాహనాల్ని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు.

- తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి ఎదుటి వాహనాలు కనిపించని వైనం
- మలుపుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటులో అధికారుల నిర్లిప్తత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిసర గ్రామాల ప్రయాణికులు


వెంకటపతిపాలెం వద్ద ప్రమాదకరమైన మలుపు


పరవాడ ఎర్రకోనేరు వద్ద మలుపు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల మలుపులు ప్రయాణికుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. నిత్యం ఏదో ఒక మలుపు వద్ద వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకొంటున్న ఘటనలు సర్వసాధారణమయ్యాయి. ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. మలుపుల వద్ద దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు, రైతులు నాటిన సరుగుడు తోటలు, ఆ మలుపుల్లో పేరుకుపోయిన ఇసుక నిల్వలకు తోడు వాహనాల అతివేగం కారణంగా ప్రమాదాలు జరిగి, వాహన చోదకులు గాయపడుతున్నారు. కొన్ని ప్రాణాలు గాల్లో కూడా కలిసిపోయాయి.

- ముత్యాలమ్మపాలెం-వాడచీపురుపల్లి రహదారిలోని 12 మలుపుల వద్ద రోజుకి ఒకటైనా ప్రమాద ఘటన జరుగుతుంది. మలుపుల వద్ద తుప్పలు, ఏపుగా పెరిగిన సరుగుడు తోటల కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు అతి దగ్గరగా సమీపించేంత వరకు కనిపించని పరిస్థితి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- వాడచీపురుపల్లి-పరవాడ రహదారిలో గొల్లపేట వద్దనున్న మలుపూ ప్రమాదకరమైనదే. ఎన్టీపీసీ నిర్మించిన రక్షణ గోడ కారణంగా ఎదుటి వాహనాలు కనిపించని పరిస్థితి. గతంలో ఈ మలుపులో కోళ్ల వ్యాను, ఓ ఆటోను ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.
- పరవాడ పోలీస్ స్టేషన్ వద్ద మలుపు కూడ అత్యంత ప్రమాదకరమైందనే చెప్పాలి. పోలీస్ స్టేషన్ వద్ద ఏపుగా పెరిగిన చెట్ల కారణంగా మలుపులో రాకపోకలు సాగించే ప్రయాణికులు దూరంలో ఉండగానే గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఈ మలుపులో ద్విచక్ర వాహనాన్ని ఓ వ్యాన్ ఢీ కొట్టిన ఘటనలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. పోలీస్ స్టేషన్‌కు వివిధ పనులపై వచ్చే ప్రయాణికులు రోడ్డు దాటుతున్న సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది.


భర్నికం వద్ద ప్రమాదకరమైన మలుపు

- పరవాడ ఎర్ర కోనేరు వద్ద మలుపు ప్రమాదకరమైనదే. గతంలో ఈ మలుపులో ఓ వాహనచోదకుడిని బస్సు ఢీ కొట్టిన ఘటనలో తానాం గ్రామానికి చెందిన స్కూటరిస్టు ప్రాణాలు కోల్పోయాడు. మలుపు వద్ద తాటి చెట్లు, తుప్పలు పెరిగిపోవడం వలన రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు.
- పరవాడ-భర్నికం రహదారిలో కోనేరు దాటిన తరువాత ఉన్న మలుపు ఇద్దరు విద్యార్థులను పొట్టనపెట్టుకుంది. గతంలో భర్నికం నుంచి పరవాడ వైపు ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులు ఎదురుగా వస్తున్న వాహనాన్ని అకస్మాత్తుగా చూసి, బండిని అదుపుచేయలేక రోడ్డుపైన పడిపోయాడు. తీవ్రంగా గాయపడి ప్రాణాలు వదిలారు.
- భర్నికం వద్ద మలుపులో ఇరువైపుల ఇళ్ల నిర్మాణాలు కారణంగా వాహనాలు కనిపించడం లేదు. ఫలితంగా ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- మండల కాంప్లెక్స్ మలుపులో వాహనచోదకులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. సినిమాహాలు, సబ్‌స్టేషన్, ఊటగెడ్డ కూడళ్లలో మలుపుల వద్ద నిత్యం ఇదే పరిస్థితి.

#### తుప్పలు తొలగించాలి



రోడ్ల మలుపులు భయపెడుతున్నాయి. అక్కడ దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలతో ఎదురుగా వచ్చే వాహనాల్ని సకాలంలో గుర్తించలేక, ప్రమాదాల్లో చిక్కుకుంటున్నాం. చీకటిపడ్డాక ఈ రోడ్ల మీద ప్రయాణించాలంటేనే భయపడుతున్నాం. మలుపుల వద్ద తుప్పల్ని, డొంకల్ని తొలగిస్తే కాస్త మేలు.

– కె.గంగునాయుడు, గంగునాయుడుపాలెం

#### హెచ్చరిక బోర్డుల్లేవు



ప్రమాదకరమైన మలుపులను గుర్తించి, అప్రమత్తమయ్యేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. దీంతో ప్రమాదాలను కొంతైనా నియంత్రించవచ్చు. కలపాక-పరవాడ రహదారిలో చాలా చోట్ల మలుపులు ఉన్నాయి. రాత్రి సమయంలో ఆయా మలుపుల వద్ద ఇబ్బందులు పడుతున్నాం.

– గొర్లి నవీన్, కలపాక

#### ఉన్నతాధికారులకు నివేదించాం

మండలంలోని పలు రోడ్లలో ప్రమాదకరమైన మలుపులను గుర్తించాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ముఖ్యమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు ఆవశ్యకతను ఉన్నతాధికారులకు నివేదించాం. జంగిల్ క్లియరెన్స్ పైనా దృష్టి పెడతాం. వీలైనంత వేగంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– లలిత, ఏఈ, ఆర్ అండ్ బీ

### రెవెన్యూ సదస్సులో అర్జీలకు సత్వర పరిష్కారం


రెవెన్యూ సదస్సులో రీ సర్వే డీటీ గణేష్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

సబ్బవరం: రెవెన్యూ సదస్సులో రైతులు అందించే అర్జీలను సత్వరం పరిష్కరించేదుకు కృషి చేస్తామని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్ అన్నారు. మండలంలోని అసకపల్లి శివారు ఎరుకునాయుడుపాలెంలో సోమవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రీ సర్వేలో రైతుల విస్తీర్ణాల్లో తేడాలున్నా, ఖాతాదారుల పేర్లు తప్పుగా నమోదైనా ఈ సదస్సుల ద్వారా సరిచేసుకోవచ్చన్నారు. ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధిలో 90 సర్వే నంబర్లలో 917.43 ఎకరాల మొత్తం భూమి ఉందన్నారు. దీనిలో 485.89 ఎకరాల ప్రభుత్వ భూమి, 431 ఎకరాల జిరాయితీ ఉన్నట్లు వెల్లడించారు. గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుండి 82 అర్జీలు వచ్చాయన్నారు. వీటిని వీలైనంత వేగంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నరసింగరావు, మండల సర్వేయర్ లాలం అప్పారావు, మాజీ ఎంపీటీసీ చల్ల అప్పలనాయుడు, మాజీ ఉపసర్పంచ్ మొల్లి చిన్నారావు, గవర అప్పారావు, వీఆర్వో దొగ్గ ఈశ్వరరావు, విలేజ్ సర్వేయర్లు పైడి మోహన్‌రావు, ఎం.ఆదిత్య, మహిళా పోలీస్ జి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ తహసీల్దార్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు

పరవాడ: సమాచార హక్కు చట్టం(ఆర్టీఏ) ద్వారా సమాచారం ఇచ్చేందుకు నిరాకరించిన పరవాడ పూర్వ తహసీల్దార్ డి.శాంతిభూషణ్‌రావుకు వ్యతిరేకంగా గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన సీహెచ్ అప్పారావు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదును లోకాయుక్త న్యాయస్థానం విచారణకు స్వీకరించిందని సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో ప్రభుత్వ భూములు, నీటి ప్రవాహ భూములు, సామూహిక భూములకు సంబంధించి పరిరక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ ఏడాది మే 15న రెవెన్యూ అధికారులకు అప్పారావు ఫిర్యాదు చేశారు. అనంతరం జూలై 19న తన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని, అందుకు సంబంధించిన సమాచారాన్ని కోరారు. సమాచారం ఇచ్చేందుకు అప్పటి తహసీల్దార్ శాంతిభూషణ్‌రావు నిరాకరించారు. సర్వే నిబంధనలు, భూముల రీ సర్వే పునఃసమీక్షకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇప్పించడమే కాకుండా ప్రభుత్వ భూముల రీ సర్వేకు నష్టం కలిగించిన శాంతిభూషణ్‌రావుపై చర్యలు తీసుకోవాలని ఆగస్టు 8న లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై న్యాయస్థానం తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు అప్పారావు వెల్లడించారు.

## చుట్టూ ఇళ్లు.. మధ్యలో వాన నీరు


సాయినగర్ కాలనీలో ఇళ్ల మధ్య రోజుల తరబడి నిలిచిపోయిన వర్షపు నీరు

పరవాడ: దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీటితో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. కాలనీలో వర్షపు నీరు పోయేందుకు సరైన మార్గం లేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలో మోకాలి లోతున నీరు నిలిచిపోయింది. రాకపోకలకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించలేదని వాపోతున్నారు. వర్షపు నీరు నిలిచిపోయి విషజ్వరాలు ప్రబలుతున్నాయని, చాలా మంది రోగాలతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వర్షపు నీరు ప్రవహించేందుకు వీలుగా కాలువల నిర్మాణం చేపట్టాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కె.కృష్ణంనాయుడు కోరారు.

## పంచాయతీల్లో సచివాలయాల విలీనానికి వినతి


జేసీ జాహ్నవికి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు సుజాత

పరవాడ: గ్రామ సచివాలయాలను గ్రామ పంచాయతీల్లో విలీనం చేయాలని అనకాపల్లి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు చింతకాయల సుజాత జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో సోమవారం జాయింట్ కలెక్టర్ జాహ్నవికి వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని అనుసంధానం చేసి, సిబ్బందిని కూడ పంచాయతీలో నియమించాలని ఆ వినతిపత్రంలో కోరారు. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ఒక్కో సచివాలయానికి 11 మంది సిబ్బందిని నియమించిందని, వారిపై సరైన పర్యవేక్షణ లేక గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. దీన్ని అధిగమించేందుకు వీలుగా పంచాయతీలకు సచివాలయాలను అనుసంధానం చేయడమే సరైన నిర్ణయమన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో కోరారు.

### 'రాయల' కోనేరు

మీకు తెలుసా?



భారతదేశ రాచరిక పాలనలో విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలది ప్రత్యేక స్థానం. అలాంటి చరిత్ర కలిగిన చక్రవర్తి 'జ్ఞాపకం'కోనేరు రూపంలో పెందుర్తి మండలం పెదగాడిలో ఇప్పటికీ ఉంది. బ్రిటీష్‌వారు దేశాన్ని ఆక్రమించక ముందు, రాయల కాలంలో రైతుల నుంచి శిస్తులు వసూలు చేసే కేంద్రంగా పెదగాడి ఉండేది. అప్పట్లో రాజావారి శిష్యులు ఇక్కడ మసలాడుతున్న సమయంలో దాహార్తిని తీర్చుకునేందుకు కోనేరు తవ్వించారని ప్రతీతి. అనంతరం బ్రిటీష్ పాలనలో పెదగాడి రాణాగా ఏర్పడి కప్పం కట్టించుకునే సమయంలో తెల్లదొరలకు ఈ కోనేటి నీరే ఆదరువని తమ పూర్వీకులు చెప్పేవారని గ్రామంలోని పెద్దలు చెబుతుంటారు.

– పెందుర్తి

### ఆదినారాయణకు 'ఆంధ్ర రత్న' పురస్కారం


పురస్కారం అందుకుంటున్న ఆదినారాయణ

పెందుర్తి: సమాజసేవలో భాగంగా రక్తదాన శిబిరాలు, అనాథలు, అంధులు తదితర అభాగ్యులకు అనేక సేవలందించిన పెందుర్తి మండలం సరిపల్లికి చెందిన కోనేటి ఆదినారాయణకు ఆంధ్ర రత్న పురస్కారం లభించింది. అఖిల భారత సాంస్కృతిక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఏఎస్ శ్రీలక్ష్మీకాంతం, అన్నమయ్య జిల్లా జడ్జి డాక్టర్ పసుపులేటి శంకర్, కర్ణాటక సినీ నటి పంకజం చేతుల మీదుగా ఆదినారాయణ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## డీఎస్ఎన్ఎల్‌యూలో జాతీయ స్థాయి క్విజ్ పోటీలు

- విన్నర్ పూణే సింబయాసిస్ లా స్కూల్, రన్నర్ బెంగళూరు అలయన్స్ యూనివర్సిటీ


ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొన్న వివిధ యూనివర్సిటీల న్యాయ విద్యార్థులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లోని సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రోపర్టీ రైట్స్ అండ్ టెక్నాలజీ(సీఐపీఆర్ అండ్ టీ) ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపీఐఐటీ) సౌజన్యంతో 5వ ఏపీజే అబ్దుల్ కలాం ఐపీఆర్ నేషనల్ క్విజ్‌ను ఆన్‌లైన్ విధానంలో సోమవారం నిర్వహించింది. ఈ మేధో సంపత్తి హక్కుల గురించి విద్యార్థుల పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో మేధో సంపత్తి హక్కుల(ఐపీఆర్) ప్రాముఖ్యత గురించి తెలుసుకునేందుకు ఈ పోటీలను ఒక సదవకాశంగా మలచుకోవాలని సూచించారు. ఈ జాతీయ స్థాయి క్విజ్ పోటీలో దేశం నలుమూలల నుంచి 24 జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. సింబయాసిస్ లా స్కూల్(పూణే) నుంచి కేశవ్ జైన్ సవ్యసాచి నందితో కూడిన బృందం విజేతగా, అలయన్స్ యూనివర్సిటీ(బెంగళూరు) చెందిన కడిమి లక్ష్మీ హర్షిత, ఎం.పావని జట్టు రన్నరప్‌గా నిలిచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కన్వీనర్, డీపీఐఐటీ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ దయానందమూర్తి, సీఐపీఆర్ అండ్ టీ సభ్యురాలు డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ డెయిరీకి వ్యతిరేకంగా నిరసన


పైడివాడ అగ్రహారం పాల సొసైటీ వద్ద పాల క్యాన్లతో నిరసన తెలుపుతున్న పాడి రైతులు

సబ్బవరం: విశాఖ డెయిరీ ఆవు పాలకు ఇచ్చే ధర తగ్గించడంతో మండలంలోని పైడివాడ అగ్రహారం విశాఖ డెయిరీ పాల సొసైటీ వద్ద పాడి రైతులు పాల క్యాన్లతో సోమవారం నిరసనకు దిగారు. తీవ్ర వ్యయ ప్రయాసలు ఉన్నప్పటికీ పాడి పరిశ్రమపై ఆధారపడి, జీవనోపాధి పొందుతున్న రైతులకు పాల ధరలు తగ్గించి, విశాఖ డెయిరీ యాజమాన్యం తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. తగ్గించిన పాల ధరను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనేక డెయిరీలు అధిక ధరలతో పాలు కొనుగోలు చేస్తున్నప్పటికీ, తామంతా విశాఖ డెయిరీని నమ్ముకుని పాలు సరఫరా చేస్తున్నామన్నారు. అయినప్పటికీ రైతులకు అన్యాయం జరిగేలా డెయిరీ వ్యవహరించడం సరికాదన్నారు. పాల ధరను తక్షణమే పెంచకపోతే విశాఖ డెయిరీకి పాల సరఫరాను నిలిపేసేలా కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

### విద్యాశాఖ అప్రమత్తం

అనకాపల్లి: ఈ నెల 22, 23, 24 తేదీల్లో తుఫాన్ ఒడిశా సరిహద్దు దాటి ఉత్తరాంధ్రకు వచ్చే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు అప్రమత్తంగా ఉండాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లో నిర్మాణ పనులు నిమిత్తం తీసిన గోతులపై మూతలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థ భవనాల్లో విద్యార్థులకు బోధించవద్దని, మధ్యాహ్నం భోజనంలో ఉపయోగించే మంచినీరు కలుషితం కాకుండా దృష్టి సారించాలని సూచించారు.

## ఆదర్శ్ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్


గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఆదర్శ్ విద్యార్థులు

పెందుర్తి: ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ, పెందుర్తిలోని ఆపిల్ ఇంటీరియర్స్ పరిశ్రమను సోమవారం సందర్శించారు. యంత్రాల పనితీరును పరిశీలించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు. విద్యార్థుల వెంట కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌కు 4 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 4 వినతులు అందాయి. 98వ వార్డు అడవివరం గురుకుల పాఠశాల సమీపంలో బోరు మరమ్మతుల కోసం, అదే వార్డులో బీఆర్‌టీఎస్ రహదారి విస్తరణలో స్థలం కోల్పోయినందుకు టీడీఆర్ పరిహారం ఇప్పించాలని, 95వ వార్డు సుజాతనగర్‌లో బీఆర్‌టీఎస్ రహదారి విస్తరణలో స్థలం కోల్పోయినా టీడీఆర్ లేకపోవడంతో నిర్మాణానికి అనుగుణంగా అనుమతి ఇవ్వాలని, 89వ వార్డు నరవ చర్చి ప్రాంతంలో రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు జోనల్ కమిషనర్ హైమావతిని కోరారు. ఆయా వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ ఎంపికల షెడ్యూల్‌లో మార్పులు

అగనంపూడి: సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-2 (ఎఫ్ఏ-2) పరీక్షల వాయిదా కారణంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా ఎంపికలను రీ షెడ్యూల్ చేసినట్టు ఎస్‌జీఎఫ్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించాల్సిన ఎఫ్ఏ-2 పరీక్షలను వచ్చే నెల 4 నుంచి 6వ తేదీలకు రీషెడ్యూల్ చేసిన నేపథ్యంలో క్రీడా ఎంపికలు కూడా రీ షెడ్యూల్ చేసినట్టు పేర్కొన్నారు. 23న హాకీ ఎంపికలు అండర్-14 బాలురు, బాలికలకు నక్కపల్లి హైస్కూల్‌లో, 24న బేస్‌బాల్, రోప్ స్కిప్పింగ్ ఎంపికలు అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో అనకాపల్లిలోని జీఎంపీఎస్ పాఠశాలలో, టెన్నీకాయిట్ ఎంపికలు అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్‌లో, 25న వాలీబాల్ ఎంపికలు అండర్-14 బాలురు, బాలికల విభాగంలో ఎ.ఎల్.పురం (కెడీపేట మండలం)లో, 26న యోగాసన ఎంపికలు నక్కపల్లి మండలం వేంపాడు జెడ్పీ హైస్కూల్‌లో, 29న త్రోబాల్ అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.